సాక్షి అనకాపల్లి

మంగళవారం । 21 । మార్చి । 2023



నాటికలకు పుట్టినిల్లు అనకాపల్లి

నాటికలకు అనకాపల్లి పుట్టినిల్లులాంటిదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అన్నారు. 8లో



యువతకు ఉజ్వల భవిష్యత్తు

యువత ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి కల్పించే స్థాయికి ఎదగాలనేది ప్రభుత్వ లక్ష్యమని జిల్లా సైన్స్ అధికారి తెలిపారు. 8లో



పోషణ పక్వాడాతో పౌష్టికాహారం

పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. 8లో

విశాఖ పర్యాటక వైభవం

- జీఐఎస్‌లో రూ.8,806.44 కోట్లతో ప్రాజెక్టులకు ఎంవోయూలు
- 18,205 మందికి ఉపాధి అవకాశాలు
- అల్లూరి జిల్లాలోనూ పర్యాటకం పరుగులు
- 64 ప్రాజెక్టుల గ్రౌండింగ్‌పై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం : ప్రకృతి అందాలతో అలరారే విశాఖ పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కేందుకు సరికొత్త ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ప్రపంచ పర్యాటక పటంలో టూరిజం రాజధానిగా భాసిల్లే విధంగా పలు ప్రాజెక్టులకు సంబంధించి ఇటీవల నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. దేశీ, విదేశీ పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్న విశాఖలో ఉన్న టూరిజం స్థలాలను వినియోగంలోకి తీసుకువస్తూ.. జలక్రీడలు, సాహస పర్యాటకం, బీచ్ టూరిజం, టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం.. ఇలా భిన్నమైన సెగ్మెంట్లలో అభివృద్ధికి అడుగులు వేస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 64 ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. మొత్తం రూ.8,800 కోట్లకు పైగా ప్రాజెక్టుల ద్వారా 18 వేల మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఈ ప్రాజెక్టుల గ్రౌండింగ్ చేసే విషయంలోనూ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది.

రూ.8,800 కోట్లు.. 18 వేల మందికి ఉపాధి

ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. మొత్తంగా పర్యాటక రంగానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.21,941 కోట్లతో 129 ప్రాజెక్టులకు ఎంవోయూలు జరగ్గా.. ఇందులో సగం వరకు అంటే 64 ప్రాజెక్టులు ఉమ్మడి విశాఖకు సంబంధించినవి కావడం విశేషం. మొత్తం రూ.8,806.44 కోట్లతో విభిన్న రకాల ప్రాజెక్టులు రానున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా 18,205 మందికి ఉపాధి అవకాశాలు రానుండగా.. మరో 20 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి.

అల్లూరి జిల్లాకూ అద్భుత అవకాశాలు

అరకు, పాడేరు ప్రాంతాల్లోనూ భారీ ప్రాజెక్టులు రానున్నాయి. అల్లూరి జిల్లా పరిధిలోని పర్యాటక ప్రాంతాలకు టూరిస్టుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లోనూ తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. మారేడుమిల్లిలో రూ.1000 కోట్లతో తులి



వలిసె పూల అందాలు

హోటల్స్ ప్రై.లిమిటెడ్ సంస్థ సఫారీ టూరిజం ప్రాజెక్టుని ఏర్పాటు చేసి 1000 మందికి ఉపాధి కల్పించనుంది. విశాఖ-అరకు రోడ్‌లో మైస్టిక్స్ పామ్స్ సంస్థ రూ.50 కోట్ల పెట్టుబడితో గోల్ఫ్ రిసార్ట్ అండ్ డెస్టినేషన్ వెడ్డింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 250 మందికి ఉపాధి కలగనుంది. రూ.243 కోట్లతో 1000 మందికి ఉపాధి కల్పించేలా అనంతగిరి హిల్స్‌లో ఎకో-ఐఎస్‌ఎల్‌ఈ రిసార్ట్స్ సంస్థ రిసార్ట్స్, కన్వెన్షన్ సెంటర్, ఎమ్యూజ్‌మెంట్‌థీమ్ పార్క్ ఏర్పాటు చేయనుంది. రూ.150 కోట్లతో అరకులో ది రిప్పిల్స్ సంస్థ రిసార్టులు, విల్లాలు ఏర్పాటు చేసి 150 మందికి పైగా ఉపాధి కల్పించాలని నిర్ణయించింది. వీటితో పాటు కాంపింగ్, కారావాన్ పార్క్, అడ్వెంచర్ స్పోర్ట్స్, లగ్జరీ కాటేజీలు, వుడెన్ హౌస్‌లు, మల్టీ క్యుజిన్ రెస్టారెంట్స్ కూడా రాబోతున్నాయి.



అనంతగిరిలో రిసార్టులు

విశాఖకు రాబోతున్న ముఖ్యమైన ప్రాజెక్టులు

- సుమారు రూ.300 కోట్లతో 300 మందికి ఉపాధి కల్పించేలా ఒబెరాయ్ హోటల్స్ సంస్థ అన్నవరం సమీపంలో ఒబెరాయ్ హోటల్‌ని నిర్మించనుంది.
- రూ.208 కోట్లతో డెహ్రాడూన్‌కు చెందిన దేవ్‌భూమి రోప్‌వేస్ సంస్థ వివిధ పర్యాటక ప్రాంతాల్లో రోప్‌వే ప్రాజెక్టులు ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 50 మందికి ఉపాధి కలగలనుంది.
- రూ.1000 కోట్లతో 6,500 మందికి ఉపాధి కల్పించేలా డ్రీమ్‌వ్యాలీ గ్రూప్ సంస్థ గోల్ఫ్‌గేటెడ్ కమ్యూనిటీ విత్ 5 స్టార్ రిసార్ట్‌ని కట్టనుంది.
- రూ.300 కోట్లతో 750 మందికి ఉపాధి కల్పించేలా ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇండస్ట్రీస్ కంపెనీ 7 స్టార్ హోటల్‌ని నిర్మించనుంది.
- రూ.500 కోట్లతో 250 మందికి ఉపాధినిస్తూ మంజీరా హోటల్స్ సంస్థ హోటల్, రిసార్టు నిర్మించేలా ఒప్పందం కుదుర్చుకుంది.
- మురుగవాణి సంస్థ రూ.150 కోట్లతో 500 మందికి ఉపాధితో ఎకో టూరిజం రిసార్టులు ఏర్పాటు చేయనుంది.



స్కై టవర్

- అకొంటిపై అంతర్జాతీయ సంస్థ రూ.243 కోట్లతో 100 మందికి ఉపాధి కల్పించేలా మెగా వీల్ ఏర్పాటు చేయనుంది.
- జలవిహార్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రూ.250 కోట్లతో 500 మందికి ఉపాధి కల్పిస్తూ అన్నవరం ప్రాంతంలో జలవిహార్ టూరిజం హార్బర్‌ని నిర్మించనుంది.
- రూ.122 కోట్లతో 255 మందికి ఉపాధి కల్పించేలా గారిసన్ సంస్థ కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది.
- టర్కీకి చెందిన పోలిన్ అక్వేరియమ్స్ సంస్థ రూ.120 కోట్లతో 110 మందికి ఉపాధినందిస్తూ టన్నెల్ అక్వేరియంని నిర్మించనుంది.
- రూ.115.5 కోట్లతో 150 మందికి ఉపాధి కల్పించేలా ఎండాడలో భవానీ బీచ్ రిసార్టులు రానున్నాయి.
- రూ.100 కోట్లతో 50 మందికి ఉపాధి అందించేలా అకొంటిపై అంతర్జాతీయ సంస్థ స్కైటవర్‌ని ఏర్పాటు చేయనుంది.
- రూ.85 కోట్లతో 200 మందికి ఉపాధినందించేలా ఫ్రాన్స్‌కు చెందిన ఎరోఫైల్‌సంస్థ స్కై రెస్టారెంట్, స్కై డైవింగ్, సర్ఫింగ్, మినీ వాటర్‌పార్క్‌ని నిర్మించనుంది.
- రూ.25 కోట్లతో 30 మందికి ఉపాధి కల్పిస్తూ జపాన్‌కు చెందిన సంస్థ స్నో వరల్డ్ ఏర్పాటు చేయనుంది.
- రూ.500 కోట్లతో 500 మందికి ఉపాధినందించేలా స్వామి నారాయణ్ ట్రస్ట్ డివైన్ డెస్టినేషన్ ఫర్ స్పిరుచ్యువల్ టూరిజం ప్రాజెక్టుని ఏర్పాటు చేయనుంది.

కొత్త ప్రాజెక్టులతో కొత్త కళ



పెట్టుబడుల సదస్సులో కుదుర్చుకున్న ఎంవోయూలు గ్రౌండ్ అయ్యేలా ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా పర్యాటక ప్రాజెక్టుల కోసం టూరిజం ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఏపీ సంస్థ ఎంవోయూ చేసుకుంది.. ఆ ప్రాజెక్టుకు సరిపడా స్థలాన్వేషణ, చర్చలు, మొదలైన అంశాల్ని ఈ కమిటీ పర్యవేక్షించి.. వీలైనంత త్వరగా ప్రాజెక్టు పట్టాలెక్కేలా చర్యలు తీసుకోనున్నాం. ప్రతి పర్యాటక స్థలంలోనూ ఒక విభిన్న ప్రాజెక్టు వచ్చి.. దేశ విదేశీ సందర్శకుల్ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్న ఆలోచనలు త్వరలోనే అమలు కానున్నాయి.

– శ్రీనివాస్ పాణి, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్

న్యూస్‌రీల్

నాణ్యమైన విద్యే లక్ష్యం



భోజనం రుచి చూస్తున్న డిప్యూటీ డీఈవో ప్రేమ్‌కుమార్

రాంబిల్లి: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా కృషిచేయాలని డిప్యూటీ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన రాంబిల్లి, లాలంకోడూరు, కొత్తపట్నం ఉన్నత పాఠశాలలను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. లాలంకోడూరు ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పరీక్షలు సమీపిస్తున్నందున పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎం.సూర్యారావు, హెచ్‌ఎం వేణుగోపాల్ పాల్గొన్నారు.

'సంవాద్-ఇండియా'కు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలో ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి మే 31 వరకు చేపట్టే యువ సంవాద్-ఇండియా 2047 కార్యక్రమ నిర్వహణకు కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్స్ (సీబీవో)ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి జి.మహేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. పంచప్రాణుల దేశ భవిష్యత్తుపై సానుకూల చర్చను రూపొందించడానికి కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్స్ సహకారంతో జిల్లాస్థాయిలో కార్యక్రమాల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. ఆసక్తి గల సీబీవోలు ఏప్రిల్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సీబీవోలు రాజకీయ పక్షపాతం, కల్మషం లేని చరిత్ర కలిగి ఉండాలని, ఎలాంటి క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉండరాదన్నారు. కార్యక్రమం నిర్వాహణ కోసం ఆర్గనైజింగ్ సీబీవోకు రూ.20 వేలు చెల్లించనున్నట్టు తెలిపారు. విశాఖపట్నంలోని నెహ్రూ యువ కేంద్రం నుంచి దరఖాస్తులను పొంది సూచించిన ప్రొఫార్మాలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలు కోసం 0891-2712596, 99514 51485 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

అగ్నిపథ్‌కు దరఖాస్తుల ఆహ్వానం



తుమ్మపాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్‌కు నిరుద్యోగ అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సెట్విస్ సీఈవో పి.నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అవివాహిత నిరుద్యోగ స్త్రీ, పురుషులు ఈనెల 17 నుంచి 31 వరకు agnipathvayu.cdac.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ ఏడాది మే 20 నుంచి ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 2002 సంవత్సరం డిసెంబర్ 23 నుంచి 2006 జూన్ 26వ తేదీల మధ్య జన్మించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

క్రీడాకారులకు ఓఎన్‌జీసీ స్కాలర్‌షిప్‌లు

అనకాపల్లిటౌన్: యువ ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) స్కాలర్‌షిప్పులు అందజేస్తోందని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎన్.సూర్యారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు స్పోర్ట్స్ స్కాలర్‌షిప్ కోసం 2023-24 ఏడాదికి గాను ఈనెల 27వ తేదీ సాయంత్రం 5గంటలలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్లను https://sportsscholarship.onge.co.in అప్‌లోడ్ చేయాలని తెలిపారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వీఆర్వో సరెండర్

అనకాపల్లిటౌన్: విధి నిర్వహణలో అలసత్వం వహించిన వీఆర్వోను తహసీల్దార్ గంగాధరరావు సోమవారం కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేశారు. మండలంలో మాకవరం వీఆర్వోగా విధులు టి.గంగరాజు భూసర్వేలో నిర్లక్ష్యం వహించినందుకు గాను ఈ చర్య తీసుకున్నట్టు తహసీల్దార్ చెప్పారు.

నేడు కాయకల్ప బృందం సందర్శన

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని మంగళవారం కాయకల్ప బృందం సభ్యులు సందర్శించనున్నట్టు సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ సోమవారం తెలిపారు. రోగులకు అందుతున్న సేవలు, పారిశుధ్యం తదితర అంశాలను బృందం సభ్యులు పరిశీలిస్తారని పేర్కొన్నారు. వైద్యాలయానికి గతంలో కాయకల్ప అవార్డు వచ్చిందని, ఈ సారి కూడా వచ్చే విధంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

'స్పందన' అర్జీలకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- 207 అర్జీల స్వీకరణ

తుమ్మపాల: స్పందనకు వచ్చే వినతులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ వీసీ హాలులో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జేసీ కల్పనాకుమారి, అధికారులతో కలిసి 207 అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్జీని తిరస్కరిస్తే అందుకు కారణాలు స్పష్టంగా తెలియజేయాలన్నారు. స్పందన ఫిర్యాదులపై ప్రతి రోజూ కనీసం అరగంట సమయాన్ని కేటాయించాలన్నారు. స్పందన అర్జీల నమోదు కేంద్రం వద్దకు డీఆర్వో పి.వెంకటరమణ వెళ్లి వృద్ధులు, వికలాంగుల వద్ద నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేబీ రోడ్డులో ఆక్రమణలను తొలగించండి

అనకాపల్లి మండలం కొత్తూరు-బుచ్చెయ్యపేట (కేబీ) రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించిన తరువాత విస్తరణ పనులు నిర్వహించాలని కూండ్రం గ్రామస్తులు స్పందనలో అర్జీ అందజేశారు. ఆర్‌అండ్‌బీ స్థలంలో ఆక్రమణలపై అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ ఆక్రమణదారులు పట్టించుకోవడం లేదని తెలిపారు.



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ కల్పనా కుమారి

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం గ్రామానికి చెందిన 40 మంది గ్రామస్తులు దరఖాస్తు చేసుకున్నారు. సచివాలయంలో రెండు సార్లు అర్జీలు అందజేశామని, వాటిని తిరస్కరించారని తెలిపారు. విచారణ చేపట్టి అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ఎస్పీ కార్యాలయంలో..

అనకాపల్లిటౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ గౌతమి సాలి 35 అర్జీలు స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి దిగువస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆస్తి, కుటుంబ సమస్యలపై ఎక్కువగా అర్జీలు వచ్చినట్టు ఎస్పీ తెలిపారు.

చల్లంగ చూడమ్మ.. నూకాలమ్మ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఆలయ ఈవో చంద్రశేఖర్, దాడి జయవీర్, ఎస్‌ఐలు



బందోబస్తుపై సూచనలిస్తున్న ఇన్‌చార్జి డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు

- ఘనంగా ప్రారంభమైన నూకాంబిక జాతర
- అమ్మవారికి వేడుకగా అమావాస్య పూజ

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి జాతర సోమవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు అమ్మవారికి అమావాస్య పూజను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణ ఎస్‌ఐలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి నూకాంబిక దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ రాత్రంతా అమ్మవారి దర్శనార్థం ఆలయాన్ని తెరిచి ఉంచుతామన్నారు. ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఇన్‌చార్జి డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు పోలీసు అధికారులకు సూచనలు చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 15 మంది ఎస్‌ఐలు, 200 మంది పోలీస్ సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

దాడులు సరి కాదు

- అసెంబ్లీ చరిత్రలోనే ఇది బ్లాక్ డే
- ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

మహారాణిపేట: అసెంబ్లీ సమావేశాల్లో వైఎస్సార్ సీపీకి చెందిన దళిత శాసనసభ్యుడు సుధాకర్‌పై టీడీపీ సభ్యులు దాడి చేయడాన్ని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో దాడులు సరి కాదన్నారు. ప్రజా సమస్యలు చర్చించాల్సిన చోట శాసనసభ్యులపై వారు దాడులకు పాల్పడటాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. టీడీపీ సభ్యులు పథకం ప్రకారం స్పీకర్‌పై పేపర్లు చించి విసిరారన్నారు. ఇది చంద్రబాబు వ్యూహం అని ఆమె ఆరోపించారు. సభలో అత్యంత గౌరవప్రదంగా చూడాల్సిన స్పీకర్ స్థానానికి కూడా విలువ ఇవ్వకుండా టీడీపీ నేతలు ప్రవర్తించడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ నేత, దళిత శాసనసభ్యుడు సుధాకర్, డిప్యూటీ స్పీకర్ నారాయణ స్వామిపై భౌతికదాడులకు దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. దాడులకు పాల్పడిన టీడీపీ ఎమ్మెల్యేలు క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

'అమ్రిత్ జలధార'కు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: అమ్రిత్ జలధార పథకం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హులైన ఎస్సీ రైతులు దరఖాస్తు చేసుకోవాలని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ డి.వి.రమణ మూర్తి తెలిపారు. సోమవారం జేసీ చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో పథకం అమలుపై సమీక్షించారు. 2.5 ఎకరాల భూమి ఉన్న ఎస్సీ రైతులు బోరు వేసుకునేందుకు రూ.50 వేలు సబ్సిడీ పొందవచ్చన్నారు. ఎస్సీ నిరుద్యోగ యువతీ/యువకులు ఉపాధి కోసం ఆటో, ట్రాక్టర్ కొనుగోలు, కిరాణా షాపు, ఫొటో స్టూడియో టెంట్ హౌస్, మెడికల్ క్లినికల్ ల్యాబ్, బ్యాంగిల్ షాపు పెట్టుకునేందుకు రూ.60 వేలు సబ్సిడీ పొందవచ్చన్నారు. రైతు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాసుపుస్తకం, ఆదాయ పత్రం సమర్పించాలని తెలిపారు. అర్హత గల వారు ఈ నెల 27వ తేదీ లోపు విశాఖపట్నంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేలా దృష్టి సారించాలన్నారు. దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పూర్తి వివరాలకు 8317559817 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

14 మంది మెడికల్ విద్యార్థులకు శిక్షణ

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో 14 మంది మెడికల్ విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. విశాఖ ఏఎంసీలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 14మంది విద్యార్థులు ఇక్కడ శిక్షణపొందుతున్నట్టు వైద్యాలయం ఆర్‌ఎంవో భారతి సోమవారం తెలిపారు. మూడు నెలల పాటు వివిధ విభాగాల్లో శిక్షణపొందనున్నట్టు చెప్పారు. అత్యవసర, జనరల్ విభాగంలో షిఫ్టులు వారీగా రెగ్యులర్ వైద్యునితో పాటు వీరు రోగులకు సేవలు అందిస్తారని ఆమె పేర్కొన్నారు.

నేటి నుంచి బడుల్లో రాగిజావ

- మంగళ, గురు, శనివారం విద్యార్థులకు అందజేత
- జిల్లాలో 1435 పాఠశాలల్లో అమలు
- 1,23,897 మంది విద్యార్థులకు ప్రయోజనం

సాక్షి, అనకాపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావ అందించేందుకు అంతా సిద్ధమైంది. నేటి(మంగళవారం) నుంచి జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ఇవ్వనున్నారు. ఇక నుంచి వారంలో మూడు రోజులు (మంగళ, గురు, శనివారం) విద్యార్థులకు రాగిజావ అందజేస్తారు. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని 1,435 పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 1,23,897 మంది విద్యార్థులు దీని ద్వారా లబ్ధి పొందనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులందరకీ రాగి జావ అందించేలా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు. రాగిజావ తాగేందుకు అవసరమైన గ్లాసులను కూడా విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. యుద్ధ ప్రాతిపదికన గ్లాసులను కొనుగోలు చేసి విద్యార్థులకు అందించేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. అంత వరకు విద్యార్థులు ఇంటి వద్ద నుంచే గ్లాసులను తెచ్చుకునేలా వారిలో అవగాహన కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదేశాలు అందాయి. ఇందుకనుగుణంగా జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు.

అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి

ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా రాగి జావ ఇచ్చే కార్యక్రమాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో దీనిని వేడుకగా ప్రారంభించేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే డీఈవో వెంకటలక్ష్మమ్మ సోమవారం జిల్లాలో గల పలు పాఠశాలలను సందర్శించారు. పాఠశాలలకు సరఫరా అయిన రాగి జావ, బెల్లం పొడి ప్యాకెట్లు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీఈవో చెప్పారు. విద్యార్థుల్లో రక్త హీనత నివారణకు రాగిజావ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దీనిని సమర్థంగా అమలు చేసేందుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

ఇక నుంచి పాఠశాలల్లో మెనూ ఇలా..

సోమవారం : పొంగలి/బిర్యానీ, గుడ్డుకూర, వేరుశనగ చిక్కీ • **మంగళవారం:** పులిహోర, దొండకాయ చట్నీ, ఉడికించిన గుడ్డు, రాగిజావ • **బుధవారం:** కూరగాయలతో అన్నం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ • **గురువారం:** సాంబార్ అన్నం/ నిమ్మకాయ రైస్, ఉడికించిన గుడ్డు, రాగిజావ • **శుక్రవారం:** అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గడ్డు, వేరుశనగ చిక్కీ • **శనివారం:** ఆకుకూర అన్నం, రసం, తీపి పొంగలి , రాగిజావ

వాలీబాల్ పోటీలకు గణపర్తి మహిళా పోలీసు


పి.లీలారాణి

మునగపాక: మండలంలోని గణపర్తి మహిళా పోలీసు పి.లీలారాణి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ మహిళల వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. గణపర్తి సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న లీలారాణి ఈనెల 22 నుంచి 26 వరకు కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో జరగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ మహిళల వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు.ఆమె ఎంపికపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య


ఎన్టీఆర్ వైద్యాలయంలో శ్రీనుకి వైద్యం చేస్తున్న వైద్యులు

అనకాపల్లిటౌన్ : మండలంలో డీబీ కాలనీకి చెందిన బండి శ్రీను(39) అనే వ్యక్తి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన శ్రీనుకు ఇద్దరు భార్యలున్నారు. మొదటి భార్య కాకినాడ ఉండగా, రెండో భార్య వెంకటలక్ష్మితో కలిసి శ్రీను ఉంటున్నాడని ఎస్ఐ చెప్పారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో శ్రీను పురుగుమందు సేవించినట్లు తెలుసుకున్న వెంకటలక్ష్మి అతన్ని వెంటనే ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం శ్రీనును విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే అతను మృతి చెందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరిగి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఘటనపై వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

నాటికలకు పుట్టినిల్లు అనకాపల్లి


జ్యోతిప్రజ్వలన చేసి నాటిక పోటీలను ప్రారంభిస్తున్న దాడి వీరభద్రరావు


మునగపాకలో నాటిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న దృశ్యం

అనకాపల్లిటౌన్: కళలను, కళాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అన్నారు. స్థానిక వి.వి.రమణ రైతుభారతి ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతిసరళ స్మారక కళా పరిషత్, 1975 ఎంహెచ్ స్కూల్ పూర్వవిద్యార్థుల సహకారంతో ఉమ్మడి ఏపీ ద్వితీయ ఆహ్వాన నాటిక పోటీలను ఆయన జ్యోతిప్రజ్వలన చేసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళా పరిషత్ కార్యదర్శి పి.సిహెచ్.నాయుడు కళలను, కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తన భార్యపేరుతో జ్యోతిసరళ స్మారక కళా పరిషత్ ఏర్పాటు చేసి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నాటికలకు అనకాపల్లి పుట్టినిల్లులాంటిదని, నాటికలు, నాటకాలను పట్టణ ప్రజలు ఎంతగానో ఆదరిస్తారన్నారు. మూడురోజులపాటు నిర్వహించే ఈ పోటీలను ప్రేక్షకులు వీక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ, వ్యవసాయదార్ల సంఘం కార్యదర్శి విల్లూరి రాము, భీశెట్టి కృష్ణ అప్పారావు పాల్గొన్నారు. అనంతరం విజయవాడ వారిచే 'స్వర్ణకమలాలు', చిలకలూరిపేటవారిచే 'నాన్న నేనొచ్చేస్తా' అనే నాటికలు ప్రదర్శించారు.

ఆకట్టుకున్న 'బరిబత్తుల రాజు'

మునగపాక : స్థానిక నందీశ్వర కళా ప్రాంగణం తులసీ కళావేదికపై సోమవారం రాత్రి ప్రదర్శించిన బరిబత్తుల రాజు నాటిక అందరినీ ఆకట్టుకుంది. గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నాటిక ప్రదర్శించారు. నాటిక ప్రదర్శనను ఎఫ్ఎం బాబాయ్, సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహన్‌రావు, డాక్టర్ సతీష్ కుమార్, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ నాటికలో కళాకారులు అద్భుతంగా నటించారు. హైదరాబాద్‌కు చెందిన భూమిక థియేటర్ గ్రూప్ వారు నిర్వహించిన బరిబత్తుల రాజు నాటికకు జి.సంయుక్త రచన అందించగా, రాజీవ్ రంజన్ దర్శకత్వం వహించారు.

యువతకు ఉజ్వల భవిష్యత్తు


- కల్పనకు ప్రభుత్వం కృషి
- జిల్లా సైన్స్ అధికారి ప్రసాద్

తుమ్మపాల: యువత ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి వాటిని కల్పించే స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని ఇందుకు వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎస్‌సీఈఆర్‌టీ, సమగ్రశిక్ష పర్యవేక్షణలో పట్టణంలో జీవీఎంసీ ప్రధాన పాఠశాలలో నిర్వహించిన వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం ఎక్స్‌పో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థులు వ్యవస్థాపక మనస్తత్వం అలవర్చుకోవాలనే దృక్పథంతో రాష్ట్రప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తోందన్నారు.

ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలో 215 పాఠశాలల్లో 375 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. ఈ శిక్షణలో 13,151 మంది తొమ్మిదో తరగతి విద్యార్థులను భాగస్వామ్యం చేసినట్టు తెలిపారు. ఎక్స్‌పో పరిశీలకులు, ఏఎంఏఎల్ కళాశాల ప్రొఫెసర్ ఎం.హరిబాబు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు ఊతమిచ్చే ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో రావాలన్నారు. ఇలాంటి ఎక్స్‌పోల కారణంగానే నేడు ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఎదుగుతున్నాయన్నారు. ఈఎండీపీ జిల్లా మేనేజర్ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 139 పాఠశాలలు 403 ప్రాజెక్టులు చేయగా 10 ఉత్తమ ప్రాజెక్టులుగా జిల్లాస్థాయికి ఎంపిక జరిగాయన్నారు. వాటిలో రెండు ప్రాజెక్టులు చెట్టుపల్లి జెడ్పీ హెచ్ఎస్, పాయకరావుపేట ప్రభుత్వ పాఠశాల రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మెంటార్ టీచర్లు ఎం.ప్రసాద్, రుత్తల శివరాం, హెచ్ఎం బ్రహ్మాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితులంటే టీడీపీకి చులకన

- చంద్రబాబు ప్రోత్సాహంతోనే ఎమ్మెల్యేపై దాడి
- మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు



నక్కపల్లి: తెలుగు దేశం పార్టీకి, చంద్రబాబునాయుడికి దళితులంటే చాలా చులకన అని పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు ఆరోపించారు. సోమవారం ఆయన నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు దళితుల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని ఎద్దేవా చేశారని, పలువురు దళిత నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై హేళనగా మాట్లాడేవారన్నారు. టీడీపీ ఎమ్మెల్యేగా పనిచేసిన చింతమనేని ప్రభాకర్ దళితులకు ఎందుకురా రాజకీయాలు అని తక్కువ చేసి మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. తాజాగా అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడడం చాలా దుర్మార్గమన్నారు. టీడీపీ నాయకులు అసెంబ్లీని రణక్షేత్రంగా మార్చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ అన్నా, స్పీకర్ స్థానమన్నా కనీస గౌరవం లేదని ఆక్షేపించారు. సభా మర్యాదలు పాటించడం లేదన్నారు. అసెంబ్లీ అంటే దేవాలయం లాంటిదని, అలాంటి చోట స్పీకర్‌పై కాగితాలు విసరడం, అధికార పక్ష ఎమ్మెల్యేలపై దాడులకు పాల్పడడం అనైతికమని మండిపడ్డారు. చంద్రబాబు ప్రోత్సాహంతోనే టీడీపీ ఎమ్మెల్యేలు ఇలాంటి దుర్మార్గపు పనులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు ఛీత్కరించి 23 స్థానాలకు పరిమితం చేసినా, టీడీపీ నేతల్లో మార్పు రావట్లేదని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తున్న దళితులను చంద్రబాబు టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. తనకు వ్యతిరేకంగా ఉంటున్న దళితులను ఏ విధంగా అణగదొక్కాలన్న ఆలోచనతోనే చంద్రబాబు ఉన్నారని పేర్కొన్నారు. చంద్రబాబు బీసీలు, ఎస్సీ, ఎస్టీలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్నారని ఆక్షేపించారు. జగనన్న దళితులకు డిప్యూటీ సీఎం పదవితోపాటు, పలు మంత్రి పదవులు, కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్, డైరెక్టర్ పదవులు ఇచ్చిన విషయాన్ని చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు.

దళితులకు రాజ్యాధికారం కల్పించడం వల్లే దళితులంతా జగన్ వెంట ఉన్నారని తెలిపారు. దీన్ని ప్రతిపక్ష నేత తట్టుకోలేకే దళిత ఎమ్మెల్యేలు, అధికారులు, ద్వితీయ శ్రేణి నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా పద్ధతి మార్చుకోకపోతే దళితులంతా ఏకమై వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ప్రతిపక్ష స్థానం కూడా లేకుండా చేస్తారన్నారు.

కొడుకు మృతిపై దర్యాప్తు కోరుతూ తల్లి ఆందోళన


ధర్నా చేస్తున్న మృతుడి తల్లి కృప, మద్దతు పలికిన విశాఖ మహిళా వేదిక, పలు మహిళా సంఘాలు

చోడవరం : తన కొడుకు అనుమానాస్పద మృతిపై దర్యాప్తు చేసి, వెంటనే నిందితులను అరెస్టు చేయాలని కోరుతూ మృతుడి తల్లి సోమాదుల కృప చోడవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఆమెకు పలు ప్రజా సంఘాలు మద్దతు పలికాయి. గత నెల చోడవరం లక్ష్మీదేవిపేటకు చెందిన సోమాదుల రాజేష్(22) అనే యువకుడు బీఎన్‌రోడ్డుపై గజపతినగరం వద్ద రోడ్డుపై మృతి చెంది పడి ఉన్నాడు. మొదట రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్టు అందరూ భావించగా తర్వాత ఆమె తల్లి సోమాదుల కృప తన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందలేదని, కొందరు అతనిని చంపి రోడ్డుపై పడేశారని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో చోడవరం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసులో అనుమానం వ్యక్తం చేసిన వారిని పోలీసులు అరెస్టు చేయలేదని ఆరోపిస్తూ తనకు న్యాయం చేయాలని కోరుతూ మృతుడి తల్లి కృప చోడవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కృపకు మద్దతుగా విశాఖ మహిళా వేదిక అధ్యక్షురాలు, ప్రముఖ న్యాయవాది కె.కుసుమ, స్థానిక మహిళా సంఘాల ప్రతినిధులు మద్దతు పలికారు. చోడవరానికి చెందిన ఇద్దరు యువకులతోపాటు తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఒక వ్యక్తి కూడా తన కొడుకు మృతికి కారణమని మృతుడి తల్లి అనుమానం వ్యక్తం చేశారు. తన కొడుకును హత్యచేశారని, పోలీసులు మాత్రం రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ కేసులో వెంటనే దర్యాప్తు చేసి తనకు న్యాయం చేయాలని, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కేసుపై స్థానిక పోలీసు, రెవిన్యూ అధికారులు స్పందించకపోతే, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని మహిళా వేదిక అధ్యక్షురాలు కుసుమ అన్నారు. అనంతరం తహసీల్దార్ తిరుమలరావుకు వినతి పత్రం అందజేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నర్సీపట్నం : మండలంలోని గురంధరపాలేనికి చెందిన బి.అప్పారావు(38) అనారోగ్యం కారణంగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ రామారావు తెలిపారు. మృతుడు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు మృతుడు మద్యానికి బానిసగా మారి, అనారోగ్యం బారిన పడ్డాడు. గత కొన్ని మాసాలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం ఇంటి ఆవరణలో ఉన్న బాత్‌రూమ్‌లోకి వెళ్లి లోపల గడియ పెట్టుకుని ఉరి వేసుకున్నాడు. బాత్‌రూమ్‌లోకి వెళ్లిన వ్యక్తి ఎంతకూ బయటకు రాకపోవడంతో బలవంతంగా డోర్ తీసి చూసే సరికి మృతదేహం వేలాడుతోంది. మృతునికు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గంజాయి నిందితుడు అరెస్ట్


నిందితుడు రవీందర్‌తో ఎస్ఐ సంతోష్

అరకులోయ రూరల్: గంజాయి నిందితుడు కిల్లో రవీందర్‌ను అరెస్ట్ చేసినట్లు అరకులోయ ఎస్ఐ సంతోష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం కులసింగ్ గ్రామానికి చెందిన కిల్లో రవీందర్ 2022లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి 6 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడిన కేసులో ముద్దాయిగా ఉన్నట్టు వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితుడిని తాజాగా అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెప్సీ గోడౌన్‌లో రూ.70 వేలు చోరీ

నర్సీపట్నం : మున్సిపాలిటీ పరిధి జోగునాధునిపాలెం వద్ద ఉన్న పెప్సీ గోడౌన్‌లో చోరీ జరిగిందని టౌన్ ఎస్ఐ గోవిందరావు తెలిపారు. స్టాక్ ఈ గోడౌన్ నుండి పరసర ప్రాంతాలకు సరఫరా అవుతుంది. గోడౌన్‌లోని క్యాష్ కౌంటర్‌లో రూ.70,800 నగదు ఉంచారు. గోడౌన్ నిర్వాహకుడు దొరబాబు సోమవారం ఉదయం వెళ్లి క్యాష్ కౌంటర్ పరిశీలించగా నగదు మాయమైంది. దీంతో నిర్వాహకుడు పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోషణ పక్వాడాతో పౌష్టికాహారం

తుమ్మపాల : పుట్టిన పసిబిడ్డ నుంచి ఆరేళ్ల పిల్లలు, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు పోషణ పక్వాడా పథకం ద్వారా పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 3 వరకు నిర్వహించనున్న పోషణ పక్వాడా వారోత్సవాలను కలెక్టరేట్‌లో జేసీ కల్పనాకుమారితో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషణ పక్వాడా కార్యక్రమాన్ని 2018 నుంచి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. ప్రతి రోజు మనం తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా అన్ని శాఖలు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్వో పి.వెంకటరమణ, విద్యా, వైద్య, స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

చోడపల్లి వద్ద కొండచిలువ కలకలం


రోడ్డుపై పాకుతున్న కొండచిలువ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చోడపల్లి వద్ద కొండచిలువ కలకలం సృష్టించింది. ఆదివారం రాత్రి సమయంలో రోడ్డుపై వెళుతున్న కొండ చిలువను చూసి స్థానికులు బెంబేలెత్తారు. అది ఎటు వెళ్తుందో అంటూ ఆందోళనకు గురయ్యారు.

ప్రమాదవశాత్తూ జారిపడి గర్భిణి మృతి


మృతిచెందిన గర్భిణి దానిమ్మ

చింతపల్లి : ఆరు నెలల గర్భిణి ప్రమాదవశాత్తూ జారి పడి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలివి. మండలంలోని తాజంగి పంచాయతీ చెరువీధి గ్రామానికి చెందిన పాంగి దానిమ్మ(30) ఇంటి బయట ప్రమాదవశాత్తూ జారిపడి ఆపస్మారకస్థితికి చేరుకుంది. వెనువెంటనే ఆమెను కుటుంబ సభ్యులు 108లో వాహనంలో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే దానిమ్మ మృతి చెందినట్టు వైద్యాధికారి కీర్తి నిర్ధారించారు. ఆరు నెలల గర్భిణీగా ఉన్న దానిమ్మకు ఐదుగురు పిల్లలు ఉన్నారు. దానిమ్మ మృతితో చెరువీధి గ్రామంలోని విషాదం నెలకొంది. ఏరియా ఆస్పత్రిలోని మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా గర్భిణి దానిమ్మ మృతిపై ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ వైద్య సిబ్బంది నుంచి వివరాలను ఆరా తీశారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


ఘటనాస్థలిలో ఈశ్వరరావు మృతదేహం (ఇన్‌సెట్) ఈశ్వరరావు (ఫైల్)

అనకాపల్లిటౌన్: సబ్బవరం మండలం అసకపల్లి గ్రామానికి చెందిన డి.ఈశ్వరరావు(55) రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందాడు. రూరల్ హెడ్‌కానిస్టేబుల్ కొండయ్య అందించిన వివరాలిలా ఉన్నాయి. సబ్బవరం-అనకాపల్లి జాతీయ రహదారిలో శంకరం గ్రామం వద్ద సోమవారం తన ద్విచక్ర వాహనంపై అనకాపల్లి వైపు వస్తుండగా ఆ వ్యక్తిని వెనుక నుంచి వచ్చి లారీ ఢీకొంది. ఈ ఘటనలో ఈశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ చెప్పారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం జరగ్గా, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

యలమంచిలి : ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన యలమంచిలి మండలం రేగుపాలెం రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం జరిగింది. తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్‌అబ్దుల్ మారుఫ్ తెలిపిన వివరాలివి. అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్లే గుర్తుతెలియని రైలు నుంచి రేగుపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో (52) సంవత్సరాలు ఉన్న వ్యక్తి జారిపడ్డాడు. తీవ్రంగా గాయపడడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియలేదు. తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ టీషర్టు, ట్రాక్ ధరించి ఉన్నట్టు తెలిపారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుని ఆచూకీ తెలిస్తే తుని ప్రభుత్వ రైల్వే స్టేషన్‌లో గాని ఫోన్ నెంబర్లు, 9490619020, 9494887786లకు గాని సంప్రదించాలని ఆయన కోరారు.

తీర్థయాత్రల పేరిట మోసం


తీర్థయాత్ర కోసం చెల్లించిన డబ్బుల రశీదు


పెదబయలు పోలీసుస్టేషన్ వద్ద బాధితులు

- రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లి ఉడాయించిన ఇద్దరు వ్యక్తులు
- సుమారు రూ.6.5 లక్షల వసూలు
- టీటీడీ ఐడీ కార్డులతో నమ్మించారని బాధితుల వెల్లడి

పెదబయలు: ఇద్దరు వ్యక్తులు కాశీ తీర్థ యాత్ర పేరిట నమ్మబలికారు. ఒకొక్కరి నుంచి రూ.వేలల్లో వసూలు చేశారు. అనకాపల్లి రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ వారిని వదిలి ఉడాయించారు. పథకం ప్రకారం బురిడీ కొట్టించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలాఉన్నాయి. అరకు ప్రాంతానికి చెందిన కొర్రా నాగేశ్వరరావు, పెదబయలు మండలానికి చెందిన చలపతిరావు తీర్థయాత్రలకు తీసుకువెళ్తామని ఏజెంట్లు అవతారం ఎత్తారు. పది రోజుల యాత్రలో కాశీ, అయోధ్య, ప్రయోగ, పూరీ, అరసవెల్లి, సింహాచలం, శ్రీకూర్మం తీసుకువెళ్లి తీసుకువస్తామని రెండు నెలల ముందు నుంచి ప్రచారం చేశారు. ఒకొక్కరి నుంచి సుమారు రూ.5వేలు రెండు దఫాలుగా వసూలు చేసినట్టు బాధితులు తెలిపారు. ఇలా పెదబయలు మండలం అడుగులపుట్టు, తమరడ, సీకరి, గలగండ, అరడకోట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలం కిలగాడ, పెదగూడ, బంగారుమెట్ట, తుస్సపల్లి, పడాల్‌పుట్టు, ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాలోని సుమారు 130 మంది నుంచి రూ.6.5 లక్షలు వసూలు చేసినట్టు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్లో గంటల తరబడి..

తీర్థయాత్రలకు డబ్బులు ఇచ్చిన వారంతా ఈ నెల 18వ తేదీ ఉదయం పాడేరు చేరుకున్నారు. అక్కడినుంచి వీరిని ఆ ఇద్దరు వ్యక్తులు రెండు ఆర్టీసీ బస్సుల్లో ఎక్కించి సాయంత్రం 7 గంటలకు అనకాపల్లి రైల్వేస్టేషన్‌కు తీసుకువెళ్లారు. వీరిని రైల్వేస్టేషన్‌లో ఉంచి టికెట్లు తెస్తామని వెళ్లిన ఏజెంట్లు కొర్రా నాగేశ్వరరావు, చలపతిరావు తిరిగి రాలేదు. వారికోసం మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు నిరీక్షించారు. వారు ఎంతకీ రాకపోవడంతో మోసపోయామని గుర్తించిన వారు లబోదిబోమని స్వగ్రామాలకు వెళ్లిపోయామని బాధితులు వివరించారు.

టీటీడీ ఐడీ కార్డుల పేరిట నమ్మించి..

తిరుమల తిరుపతి దేవస్థానం పేరిట ఇద్దరు ఏజెంట్లు ఐడీ కార్డులను తమకు ఇవ్వడంతో నమ్మాల్సి వచ్చిందని బాధితులు తెలిపారు. దీనిపై సోమవారం రెండు మండలాల బాధితులతో కలిసి పెదబయలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని బాధితులు వంతినిభ సత్యనారాయణ,కిముడు జ్యోతి,కొర్ర వెంకటరావు, భాస్కరరావు తెలిపారు. దీనిపై పెదబయలు ఎస్ఐ మనోజ్‌కుమార్‌ను వివరణ కోరగా బాధితుల నుంచి ఫిర్యాదు అందిందన్నారు. గతంలో వారు తీర్థయాత్రలకు తీసుకువెళ్లినట్టు సమాచారం ఉందని ఈసారి ఎందుకు ఇలా జరిగిందో విచారణ చేస్తామన్నారు. తదుపరి కేసు నమోదు చేస్తామని ఆయన వివరించారు.

క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 25 మందికి జరిమానా



వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 25 మందిని సోమవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రూ.58 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ టి.శ్రీను సోమవారం మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శని, ఆదివారాల్లో పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాహనాలు తనిఖీ చేస్తుండగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో 25 మంది వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి, అనంతరం వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చినట్లు సీఐ వెల్లడించారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఆయుష్ వైద్యాధికారి లావణ్య

అనకాపల్లిటౌన్: ఆయుర్వేద వైద్యంపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని ఆయుష్ వైద్యాధికారి కె.లావణ్య సూచించారు. జీవీఎంసీ భీమునిగుమ్మం హైస్కూల్లో సోమవారం ఆయుష్ వైద్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడా రు. ఇంగ్లిష్ మందులపై ఆధారపడకుండా ఆయుర్వేద వైద్యాన్ని ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సంతలో సోమవారం కూరగాయలు స్థిర ధరలకు అమ్మకాలు సాగాయి. కిలో ఉల్లిపాయలు రూ.20, టమాటా రూ.25, బంగాళాదుంప, క్యాబేజీ రూ.30, క్యారెట్ రూ.40, బెండకాయ, బీరకాయ, దొండకాయ, చిక్కుడు కాయ రూ.60, క్యాప్సికం రూ.80, అల్లం రూ.120లకు విక్రయించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 4,012 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,600	4,000
మొదటి రకం	3,630	3,830
రెండో రకం	3,410	3,620
మూడోరకం	3,150	3,400

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి	సత్యనారాయణస్క్రీన్-1
మనసిస్తావా	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
షజామ్	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
జంతు ప్రపంచం	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 24 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-12 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-6 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

విజయీభవ

- ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు
- పక్కా ప్రణాళికతో సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయుల బోధన
- రోజూ 4 సబ్జెక్టుల్లో ప్రిపరేషన్.. పరీక్షల నిర్వహణ



స్టడీ అవర్‌లో చదువుకుంటున్న విద్యార్థులు



తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షలకు సన్నద్ధమవుతున్న టెన్త్ విద్యార్థులు

అనకాపల్లి రూరల్: పదో తరగతిలో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా విద్యా శాఖాధికారులు చర్యలు చేపట్టారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే సిలబస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు రివిజన్ చేస్తూ విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్‌కు అనుగుణంగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు ప్రాక్టీస్ చేయిస్తున్నారు. రైటింగ్ స్కిల్స్ పెంచుకునేలా తీర్చిదిద్దుతున్నారు. పరీక్షల ఒత్తిడిని అధిగమించేలా అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అదనపు తరగతులు నిర్వహించి పాఠాలపై పూర్తి స్థాయి పట్టు సాధించేలా చర్యలు తీసుకుంటున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి శిక్షణ ఇస్తున్నారు. అంతిమంగా అత్యుత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

ఉత్తీర్ణతా శాతం పెంచేలా కార్యాచరణ..

ప్రతి రోజూ ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తున్నారు. సాయంత్రం చివరి పీరియడ్ మాత్రం గంట చొప్పున నిర్వహిస్తూ మధ్యలో రెండు పీరియడ్స్ కలిపి ఒక సబ్జెక్టుపై దృష్టి పెడుతున్నారు. అందులో 45 నిమిషాల ప్రిపరేషన్, మరో 45 నిమిషాల పరీక్ష నిర్వహిస్తున్నారు. రోజు వారీ పరీక్షల్లో చేస్తున్న తప్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు ఒత్తిడికి గురికాకుండా ఉపాధ్యాయులు పలు సూచనలిస్తున్నారు. ఇప్పటికే ఆరు రౌండ్ల ప్రాక్టీస్ టెస్టులు, ప్రీ ఫైనల్ నిర్వహించగా.. ఈ నెల 15 నుంచి రెండో ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకూ నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో లోపాలను గుర్తించి ఏ, బీ, సీ, డీ గ్రేడులుగా విభజించారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచేలా విద్యాశాఖాధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

ఒత్తిడిని అధిగమించేలా..

టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాయడమంటే విద్యార్థుల్లో ఎంతో కొంత ఆందోళన, ఒత్తిడి ఉంటాయి. దాని నుంచి ఉపశమనం పొందేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాసేలా సూచనలిస్తున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కొంతమందిని దత్తత తీసుకుని తర్ఫీదునిస్తున్నారు. ఇటీవల పదో తరగతి విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాఠశాలల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఇంటి వద్ద పిల్లలకు ఒత్తిడి లేకుండా చూడాలని సూచించారు.

అనకాపల్లి మండలంలో 1,594 మంది..

పదో తరగతి పరీక్షలకు సంబంధించి అనకాపల్లి మండలంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ హైస్కూళ్లు 19 ఉన్నాయి. వీటిలో బాలురు 850, బాలికలు 744 మొత్తం 1,594 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

స్టడీ అవర్స్‌తో చాలా ప్రయోజనాలు



స్టడీ అవర్స్ ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. శ్రద్ధగా చదువుతూ ఆ సమయంలో వచ్చే సందేహాలను సంబంధిత ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాం. దీంతో పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన ఏర్పడుతోంది.

– కె.జయశ్రీ, టెన్త్ విద్యార్థిని, తుమ్మపాల హైస్కూల్

ప్రణాళికతో చదువుతున్నాం



ఉపాధ్యాయులు చెప్పినట్టు పక్కా ప్రణాళికతో చదువుతున్నాం. దీంతో ఒత్తిడి అన్పించడం లేదు. మంచి మార్కులు సాధిస్తామనే నమ్మకం ఏర్పడింది. ఉపాధ్యాయులు చాలా చక్కని సూచనలిస్తున్నారు. మాలో ఆత్మస్థైర్యం పెరిగింది.

– పి.ఎం.వి.ప్రణతి, టెన్త్ స్టూడెంట్,తుమ్మపాల హైస్కూల్

గ్రేడుల వారీగా విభజించి శిక్షణ



విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రేడులుగా విభజించి చదివిస్తున్నాం. ఏ గ్రేడ్ విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించేలా తర్ఫీదునిస్తున్నాం. పాఠశాలలో 50 శాతానికి పైగా సీ, డీ గ్రేడుల విద్యార్థులున్నందున వారిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. కలెక్టర్, డీఈవో ఆదేశాల మేరకు 40 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నాం.

– ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఎం, తుమ్మపాల హైస్కూల్

ఉత్తమ ఫలితాలు సాధిస్తాం



ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు అన్ని విధాల సిద్ధం చేస్తున్నాం. ఉపాధ్యాయులంతా సమష్టిగా పనిచేస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహించేలా పర్యవేక్షిస్తున్నాం. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని హెచ్ఎంలకు సూచించాం. ఉత్తమ ఫలితాలు సాధిస్తామనే నమ్మకం ఉంది.

– డి.దివాకర్, ఎంఈవో, అనకాపల్లి

'డైట్' కళాశాలలో కవితా దినోత్సవం



కవిత చదివి వినిపిస్తున్న విద్యార్థిని

అనకాపల్లిటౌన్: స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ప్రపంచ కవితా దినోత్సవం ఘనంగా జరిగింది. కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ వైకుంఠరావు, అకాడమిక్ డీన్ ఈశ్వరరావు కవితా దినోత్సవ ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించారు. ముందుగా విద్యార్థులకు కవితా పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ చల్లా నరసింహం బహుమతు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూహక్కు రీ సర్వే ప్రారంభం

మాడుగుల రూరల్: వైఎస్సార్ శాశ్వత భూహక్కు పథకం రీ సర్వే సోమవారం అవురువాడ పంచాయితీ శివారు కాగిత గ్రామంలో ప్రారంభమైంది. గ్రామం మొత్తం భూముల వివరాలను సర్వే చేశారు. ఈ సర్వే ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు జరుగుతుందని ఉప తహసీల్దార్ బి.సత్యనారాయణ తెలిపారు. ఈ సర్వేలో సర్పంచ్ కె.మోదహైందవి గుప్తేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు చెదల కృష్ణందొర, మండల సర్వేయర్ జగదీష్, వీఆర్వో భరద్వాజ్, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

అక్రమంగా తవ్విన చెరువు మూసేయాలి

పరవాడ: రసాయన వ్యర్థ జలాలు నిల్వ చేయడానికి తానాం గ్రామాన్ని ఆనుకొని రాంకీ యాజమాన్యం తవ్వకాలు జరిపిన చెరువును వెంటనే మూసివేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు.

జోరుగా గొర్రెలు, మేకల విక్రయాలు



తాళ్లపాలెం సంత వద్ద మేకల అమ్మకాలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం గొర్రెలు, మేకల అమ్మకాలు జోరుగా సాగాయి. కొత్త అమావాస్య జాతరకు వీటిని గ్రామాల్లో ఎక్కువగా వినియోగిస్తారు. దీంతో వీటికి గిరాకీ పెరిగింది. సాధారణ రోజుల కంటే రూ.3 వేల వరకు పరిమాణం అనుసరించి ఒక్కో గొర్రె, మేకకు ధర పెరగడంతో అదనపు ఆదాయం లభించిందని పెంపకందారులు, రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు కాకినాడ జిల్లా నుంచి గొర్రెలు, మేకలు వెయ్యికి పైగా అమ్మకానికి తరలివచ్చాయి. వీటిని విశాఖ, గాజువాక, అనకాపల్లి, అచ్యుతాపురం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు, ప్రజలు వచ్చి కొనుగోలు చేసి ఆటోలు, వ్యాన్లలో తరలించుకు వెళ్లారు.

వీరవనిత మల్లు స్వరాజ్యం



స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

సబ్బవరం: సాయుధ పోరాటంలో పాల్గొని భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన వీరవనిత మల్లు స్వరాజ్యం అని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు వి. ప్రభావతి అన్నారు. మండలంలోని సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ప్రభావతి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ స్వాముల కుటుంబంలో జన్మించినా తన భూమినంతా పేదలకోసం ధారాదత్తం చేశారన్నారు. పేద ప్రజలకు భూమి ఇప్పించాలని తుపాకీ పట్టుకొని భూ స్వాముల గుండెల్లో రైల్లు పరుగెత్తించిన ధీరవనిత స్వరాజ్యం అని కొనియాడారు. మహిళలకు చట్టసభల్లో సమాన హక్కు కల్పించాలని అడిగిన మొట్టమొదటి మహిళగా గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు ఉప్పాడ సత్యవతి, సీఐటీయూ మండల నాయకులు గొరేష్, వై.రాంబాబు,ఎస్. కృష్ణ, పి.వరలక్ష్మి, కందా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

23న దుర్గమాంబ ఆలయ ప్రతిష్ట

పరవాడ: ఈ.బోనంగి శివారు బొద్దపువానిపాలెంలో నూతనంగా నిర్మించిన దుర్గమాంబ ఆలయ ప్రతిష్టాపనోత్సవాన్ని ఈ నెల 23న ఘనంగా నిర్వ హించనున్నట్లు సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు చెప్పారు. 22న మధ్యాహ్నం రెండు గంటలకు గణపతి పూజ, అఖండ దీప స్థాపన, పుణ్యాహవచనం, కంకణధారణ జరుగుతుంది. అనంతరం 4 గంటలకు పసిడి కలశాన్ని గ్రామంలో ఊరేగిస్తారు. గురువారం ఉదయం 9.57 గంటలకు ఆలయ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

శోభన్‌బాబుకు ఘన నివాళి



శోభన్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముగడ అప్పారావు, గ్రామ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: ఆంధ్రుల అందాల నటుడు శోభన్ బాబు వర్ధంతి కార్యక్రమం స్థానిక విజయరామరాజుపేటలో సోమవారం జరిగింది. ఆలిండియా శోభన్‌బాబు ఫ్యాన్స్ అధ్యక్షుడు ముగడ అప్పారావు శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సినీ రంగానికి శోభన్‌బాబు చేసి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు పలకా రాము, ఆళ్ల శివ రామసత్యనారాయణ, బొబ్బిలి అప్పారావు, యల్లంకి సత్తిబాబు, పలకా సత్యనారాయణ, పిట్ల బుద్ధేశ్వరరావు, ఆళ్ల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో సోమవారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం లెక్కలు, బోట్నీ, సివిక్స్, ఒకేషనల్ సబ్జెక్టుల పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఏడు పరీక్షా కేంద్రాల్లో 3,205 మంది విద్యార్థులకు గాను 3,106 మంది హాజరుకాగా, 99 మంది గైర్హాజరయ్యారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బంది 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలు చేశారు. మాస్ కాపీయింగ్‌కు తావివ్వకుండా నిఘా నేత్రంలో పరీక్షలు జరిగాయి.

ఉగాది, శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు



సారిపల్లి రాజేష్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లిటౌన్: శారదా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఉగాది, శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సారిపల్లి రాజేష్ తెలిపారు. స్థానిక శారదా కాలనీలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. కాలనీలోని వివిధ సమస్యలను ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామని, ఇప్పటికే రహదారులు నిర్మించారని చెప్పారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కరోనా సమయంలో మృతి చెందిన మాజీ అధ్యక్షుడు సారిపల్లి నూకారాజుకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనతరం అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రాజేష్‌ను సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యు లు సూర్యనారాయణ, గైపూర్ రాజు, కల్కి శ్రీను, కోరుకొండ శివ, బొగ్గారపు ఆనందరావు, శ్రీనివాస పట్నాయక్, డానీ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో చికిత్సతో నోటి వ్యాధులు దూరం



ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభిస్తున్న ఆర్ఎంవో భారతి, వైద్యులు, సిబ్బంది

అనకాపల్లిటౌన్: నోటి క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలో గుర్తిస్తే సకాలంలో చికిత్స అందించి నయం చేయవచ్చని ఎన్టీఆర్ వైద్యాలయం ఆర్ఎంవో భారతి అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక వైద్యాలయం నుంచి ఎన్టీఆర్ క్రీడా మైదానం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నోటి ఆరోగ్య దినోత్సవంలో భాగంగా వారం రోజుల పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో నోటిని శుభ్రం చేసుకోవాలని, దంత సమస్యలుంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వైద్యాలయం దంత వైద్యులు భానుప్రియ, డి.రజని మాట్లాడుతూ మద్యం, పొగాకు తాగడం వల్ల నోటి క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రాథమిక దశలోనే నోటి క్యాన్సర్‌ను గుర్తించినట్లయితే చికిత్స ఇవ్వడం ద్వారా నివారించవచ్చని పేర్కొన్నారు. చిన్న పిల్లల కోసం ఎన్టీఆర్ వైద్యాలయం ఎదురుగా ప్రభుత్వం సత్వర బాలల చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. పిల్లలకు వచ్చే వివిధ రకాలైన వ్యాధులకు చికిత్స అందిస్తున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు రాజేష్, కాపు శ్యామల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా నూకాంబిక జాతర ఉత్సవాలు



కశింకోట నూకాంబిక ఆలయంలో పూజలు



కశింకోటలో అమ్మవారి సారె ఊరేగిస్తున్న జాలర్లు



ప్రత్యేక అలంకరణలో తాకాశి వీధి నూకాంబిక



ఉగ్గినపాలెంలో సారె ఊరేగిస్తున్న మహిళలు

కశింకోట: కశింకోటలో ప్రసిద్ధి చెందిన నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం జాలర్లు సారె ఊరేగించారు. కొత్త అమావాస్య ముందు రోజు సారెతో వచ్చి అమ్మవారిని సంప్రదాయంగా దర్శించి తొలి పూజలు చేయడం ఆనవాయితీ. ఈ మేరకు తీపి పదార్థాలు, పండ్లు, అరటి గెలలు తదితర వాటిని పళ్లాల్లో తలపై పట్టుకొని తీన్‌మార్, సంప్రదాయ డప్పులతో పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ జాలరిపేట నుంచి మహిళలు పూనకాలతో ఊరేగింపుగా గ్రామ శివారులో ఉన్న అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. అక్కడ ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు వేగి శివ గణేష్, వేగి రామరాజుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. కొత్త అమావాస్య, ఉగాదిని పురస్కరించుకొని అమ్మ వారి ఆలయాన్ని భారీగా భక్తులు దర్శించనున్న నేపథ్యంలో వారికి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. గ్రామంలో అమ్మవారి ఊరేగింపు, ఆలయం వద్ద అగ్ని గుండాలు తొక్కుట వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నేడు కొత్త అమావాస్య పూజలు

ఉగ్గినపాలెంలో మంగళవారం పెద్ద ఎత్తున కొత్త అమావాస్య ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు తెలిపారు. నూకాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతారని చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

- తాళ్లపాలెంలోని నూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు, అగ్నిగుండాలు తొక్కుట, జాతర కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.
- నరసింగబిల్లిలో కొత్త అమావాస్య జాతర, ఉగాది ఉత్సవాలు భారీగా నిర్వహించడానికి సన్నాహాలు చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.వి.వి.సత్యనారాయణ తెలిపారు.
- నూతలగుంటపాలెంలోని నూకాంబిక ఆలయంలో కొత్త అమావాస్య ఉత్సవాల నిర్వహించడానికి సన్నాహాలు చేసినట్లు కలిగెట్ల నాయుడు నిర్వాహకులు తెలిపారు.
- వెదురుపర్తి, బయ్యవరం, జమాదులపాలెం, కన్నూరుపాలెం, తదితర గ్రామాల్లో కూడా కొత్త అమావాస్య ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేత్రపర్వంగా అమ్మవారి జాతర

అనకాపల్లిటౌన్: స్థానిక తాకాశి వీధి నూకాంబిక కొత్త అమావాస్య జాతర సోమవారం రాత్రి నేత్రపర్వంగా ప్రారంభమైంది. అమ్మవారికి రాత్రి అమావాస్య, ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో భాగంగా ఆలయం వద్ద తాకాశి ఉమామహేశ్వరరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాకాశి రాజేష్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా సారె ఊరేగింపు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెంలో సోమవారం స్థానిక మహిళలు నూకాంబిక అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అరటి గెలలు, వివిధ రకాల తీపి వంటకాలు, పండ్లను పళ్లాల్లో తలపై పెట్టుకొని గ్రామంలో ఊరేగి ఆలయంలో అమ్మవారికి నివేదించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.